"ఉండవయ్యా.... మా గురూగారు పోయి నేనేడుస్తుంటే డబ్బు గురించి నువ్వేడుస్తావేం?.... నన్నన్యాయంచేసి పోయారా గురూగారు....." కిష్టయ్య రాంబాబు మీదపడి ఏడ్చాడు.

అలా పడ్డంలో కిష్టయ్యచేయి రాంబాబు డొక్కలమీదపడి రాంబాబుకి కితకితలు పుట్టాయి.

"హిహిహి...."

శవాన్ని పోలీసులకి అప్పజేప్తే డబ్బు ఇస్తారో లేదోనని సీలింగ్ వేపు చూస్తూ ఆలోచిస్తున్న సింహస్వప్న్ చెవిన ఆ నవ్వు పడనే పడింది. చటుక్కున తలవంచి రాంబాబువంక చూశాడు. రాంబాబు ఎప్పట్లాగే కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు.

"ఇప్పుడు నవ్వింది ఎవరు?"

"బాగానే ఉంది.... చచ్చిన వాళ్ళెక్కడైనా నవ్వుతారా?.... నేనే నవ్వాను" అన్నాడు కిష్టయ్య.

"నువ్వెందుకు నవ్వావ్?..... మీగురూగారూ చచ్చిపోయారుగా?....." అనుమానంగా అడిగాడు డిటెక్టివ్ సింహస్వప్న్.

"అందుకే నవ్వాను .....గురూగారు చచ్చిపోయిన షాక్‌కి నాకు మతి చెలించినట్టుంది.... హ్హాహ్హాహ్హా ...." జుట్టుపీక్కుంటూ నవ్వాడు కిష్టయ్య.

సింహస్వప్న్ కిష్టయ్య వంక క్షణంపాటు జాలిగా చూశాడు.

సరేగానీ.... పోలీసులు ఇచ్చిన ప్రకటనలో రాంబాబు శవాన్నిగానీ..... ప్రాణలతోగానీ పట్టివ్వమని ఉందా? ..... ఈ శవాన్ని చూపిస్తే డబ్బిస్తారో లేదో?" అన్నాడు కిష్టయ్యతో.

"ఇస్తారేమో.... ఇస్తేమట్టుకు మీకూ నాకు చెరిసగం...."

రాంబాబు కిష్టయ్యవంక కోపంగా చూశాడు. కిష్టయ్య కంగారుగా రాంబాబు కళ్ళూ చేత్తో మూసేశాడు.

"ఎందుకలా అతన్ని కళ్లమీద చెయిపెట్టవ్?.... " అనుమానంగా కిష్టయ్య వంక చూస్తూ అడిగాడు సింహస్వప్న్.

ఏం లేదు........ కళ్ళమీద ఈగలు వాల్తుంటే....." నసిగాడు కిష్టయ్య.

సింహస్వప్న్ అనుమానంగా ముందుకు వంగి రాంబాబు పొట్టవంక చూశాడు.

"అతని పొట్టేంటి అలా కదులుతుంది ఊపిరి తీస్తున్నట్టు?....."

"అబ్బే..... పొట్టా?..... అదేం కదలడం లేదే.... నేను మీదపడి ఏడుస్తున్నాకదూ.... అందుకే శవం అలా కదులుతుంది...." కంగారుగా అంటూ రాంబాబు పొట్టమీదకి ఒరిగిపోయి ఏడవసాగాడు కిష్టయ్య.

కిష్టయ్య కంగారుకి సింహస్వప్న్‌కి అనుమానం వచ్చింది.

మెల్లగా వంగి మోకాళ్ళమీద కూర్చుని రాంబాబు వంక చూడసాగాడు.

కిష్టయ్యకి ఒక ఆలోచన వచ్చింది.

"అలా చూస్తే ఏం తెలుస్తుంది?.... ఇలా కాళ్ల దగ్గర కూర్చుని కిందికి మొహం పెట్టి వంగుని చూస్తే పొట్ట పైకీ కిందకీ కదుల్తుందీ లేందీ మీకే తెలుస్తుంది...." అన్నాడు కిష్టయ్య.

సింహస్వప్న్‌కి కిష్టయ్య ఆలోచన బాగా నచ్చింది. అతను రాంబాబు కాళ్ల దగ్గర కూర్చుని ముందుకు వంగాడు.

రాంబాబు ఊపిరి బిగబట్టాడు.

"ఇప్పుడు గనుక రాంబాబు కాలు విసిర్తే మీ మొహం పగుల్తుంది" కిష్టయ్య సింహస్వప్న్‌తో అన్నాడు.

"చనిపోయినవాడు కాలెలా విసుర్తాడు?" ఆశ్చర్యంగా అడిగాడు సింహస్వప్న్.

"బతికుంటే సంగతి చెప్తున్న .... రెడీగా ఉండండి?"

"రెడిగానా?.... దేనికి??...." మరి ఆశ్చర్యంగా అడిగాడు సింహస్వప్న్.

"మిమ్మల్ని కాదులే నేనన్నది .... రెడీ.... వన్ .....టూ .....థ్రీ..... అన్నాడు కిష్టయ్య.

అంతే...క్షణం ఆలస్యం చేయకుండా రాంబాబు కుడికాల్ని గాలిలోకి బలంగా విసిరాడు.

రాంబాబు కాలు మొహం మీద తగిలి సింహస్వప్న్ ఎగిరి గది మూలకి పడ్డాడు.

ఆ పడినవాడు మళ్ళీ లేవలేదు.

రాంబాబు కిష్టయ్య కంగారుగా లేచి నిలబడి పిడికిళ్ళు బిగించి సింహస్వప్న్ వంక చూశారు.

అతనిలో చలనం లేదు.

'మూర్ఛపోయినట్టున్నాడు' అన్నాడు కిష్టయ్య.

'కొంపతీసి చచ్చాడేమో!..... మళ్ళీ ఇదో హత్య నా మీదే పడ్తుంది!!......' భయంగా అన్నాడు రాంబాబు.

కిష్టయ్య సింహస్వప్న్ ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు.

'బతికే ఉన్నాడులే గురుగారూ.....మనం ఇక్కడినుండి త్వరగా బయట పడాలి!.....! పోలీసులు వచ్చేస్తారు.....' అన్నాడు కిష్టయ్య.

ఇద్దరు హడావిడిగా హాల్లోకి వచ్చారు. హాల్లోంచి బయటికి వస్తుండగా కిష్టయ్య టేబులుమీద ఉన్న ఆ బాక్స్ వంక చూశాడు.

కిష్టయ్య రాంబాబు చేయిపట్టుకుని ఆపాడు. 'గురూగారూ.... ఆ బాక్స్ తీస్కెల్దామా?......'

'ఏంటా బాక్స్?......'

'మేకప్ బాక్స్ ..... ఇహనుండీ మనం ఇలాంటి ప్రైవేటు డిటెక్టివ్‌ల మీద ఆధారపడ్తేలాభం లేదు. మారువేషాలేస్కుని మనమే ఇన్వేస్టిగేషన్ చేస్కోవాలి?.....'

ఇద్దరూ బాక్స్ తెరచి చూశారు.

అందులో రకరకాల గడ్డాలు, మీసాలూ, విగ్గులూ వగైరా వగైరా ఉన్నాయ్.

***రౌడీ నెంబర్. 1***

***బస్సు ఫుల్ రష్‌గా ఉంది.***

తన చుట్టూ అంతమంది జనం ఉన్నా సరోజ మనసు ఎక్కడో ఉంది. ఆమెకి కూర్చోడానికి సీటు లేదు. రాడ్ చేత్తో పట్టుకుని నిల్చుంది.

ఆమె రాంబాబు గురించే ఆలోచిస్తూంది.

ప్రైవేటు డిటెక్టివ్ దగ్గరికి వెళ్ళిన రాంబాబు కిష్టయ్యా అక్కడేంజరిగిందో ఆ న్యూసే చెప్పలేదు. రాంబాబుకి రావడానికి కుదరదు. ఈ కిష్టయ్య కేం వొచ్చింది. ఇంటికొచ్చి చెప్పొచ్చుగా ....కనీసం ఫోనైనా చేసి ఉండాల్సింది!!....

పోనీ తనే వెళ్ళి కలుద్దామంటే ఎక్కడ పోలీసులు తన వెంటబడి రాంబాబు జాడ కనిపెడ్తారోనని భయం చూసి చూసి ఉండబట్టలేద బయలు దేరింది సరోజ.

'టిక్కెట్.....'

కండక్టర్ అరుపుతో ఈ లోకంలోకి వచ్చింది సరోజ.

టిక్కెట్ తీస్కుంటున్న సరోజ ఎందుకో అనుమానంగా అటు చూసింది.

ఒక వ్యక్తి తననే చూస్తున్నాడు తను చూడగానే పళ్ళికిలించాడు.

సరోజకి చేకాకుపుట్టింది. చటుక్కున తల తిప్పేసుకుంది.

కాస్సేపయ్యాక అతను తననే చూస్తున్నాడో లేదో నన్న కుతూహలం గొద్దీ మళ్ళీ తల తిప్పి చూసింది.

అతను తననే చూస్తున్నాడు. సరోజ చూడగానే మళ్ళీ పళ్ళు ఇకిలించాడు.

హిప్పీక్రాపు, కళ్ళకి రౌండ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు, కిందకి వాలిన రొయ్య మీసాలూ.... చెంపల మీద చాకులూ.... గళ్ల చొక్కా..... చూస్తుంటే జులాయి వెధవలా ఉన్నాడు.

ఏంటో ఆ వేధవ ఇకిలింపు! ఇంతోటి అందగాడ్ని చూసి ఆడపిల్లలు ప్రేమించేస్తారనుకున్నాడేమో!!....

ఇకిలింపుతో ఊరుకొని ఆ హిప్పీ అబ్బాయి సరోజకి కన్ను కొట్టాడు.

సరోజ మనసు భగ్గున మండింది.

'ఇలాంటి వాళ్ళని ఉప్పుపాతర వేయాలి!.....' అనుకుంది.

ఇలాంటి వాళ్ళు చూసిన కొద్దీ వేషాలేస్తారని మొహం పక్కకి తిప్పి నిల్చుంది సరోజ.

కాస్సేపయ్యాక ఎవరో సరోజ చేతిని గోకారు.

ఉలిక్కిపడిపక్కకి చూసిన సరోజకి తన పక్కనే నిలబడి ఉన్న హిప్పీ అబ్బాయి కనిపించాడు.

వీడికెంత ధయిర్యం?..... పక్కకి వచ్చి చేతిని గోకుతాడా?'......

సరోజ ఏదో అనేంతలో హిప్పీ అబ్బాయి మళ్ళీ కన్నుకొట్టాడు.

ఇంక కోపాన్ని నిగ్రహించుకోలేక పోయింది సరోజ.

'యూ స్కౌండ్రల్ ......' సరోజ చేయి అతనిచెంపని చెళ్ళునతాకింది.

'ఏమైందమ్మా......ఏమైంది......' బస్సులోని వాళ్ళు అడిగారు..

సరోజ వాళ్ళకి విషయం చెప్పింది.

అందరూ అతని మీద తలో చెయ్యివేసి బస్సులోంచి దించేశారు.

ఆ తరువాత స్టాపులో సరోజ బస్సు దిగి శ్యామ్రావు ఇంటికి వెళ్ళింది.

ఇంట్లో శ్యామ్రావు భార్య జయంతి తప్ప ఎవరూ లేరు.

'ఆయన ఇంక స్టూడియో నుండి రాలేదు.....వచ్చే టైమైంది' చెప్పింది జయంతి.

'రాంబాబు, కిష్టయ్యలు ఎక్కడికి వెళ్లారు?' అడిగింది సరోజ.

'కిష్టయ్య రాంబాబు స్టూడియోని చూస్కుంటున్నారు. మరి రాంబాబు ఎక్కడికి వెళ్ళాడో తెలీదు.....మీరు కూర్చొండి కాస్సేపయ్యాక రావొచ్చు....'

సరోజ సోఫాలో కూర్చుంది. జయంతి వంటగదిలో వెళ్ళి కాఫీ పెట్టి తెచ్చింది.

కానీ కప్పు ఖాళీచేసి టీపాయ్మీద పెట్టి గుమ్మంవంక చూసిన సరోజ మొదట ఆశ్చర్యపోయి తరువాత కోపంతో మండిపడింది.

జయంతి కెవ్వున కేకేసి 'ఎవరు.....ఎవరు నువ్వు' అంది.

గుమ్మంలో ఇందాకటి హిప్పీ అబ్బాయి నిలబడి ఉన్నాడు.

అతని గళ్లచొక్క చిరిగిపోయి ఉంది. ముక్కు కమిలిపోయిఉంది. ఒక కంటి చుట్టూ నల్లని చక్రం ఉంది.

'ఏం ..... ఇందాక తిన్నిన తన్నులు చాల్లేదా ఇక్కడికి కూడా వచ్చావ్?' కోపంగా అరిచింది సరోజ.

'అయినా ఇక్కడికి ఎలా వచ్చావ్?.....'

'నీ వెనకాలే ఫాలోఅయి వచ్చుంటాడు.....' అంది జయంతి.

గుమ్మంలో నిల్చుని ఉన్న హిప్పీ అబ్బాయి బావురుమన్నాడు.

ఆ అబ్బాయి అలా ఏడవడంతో సరోజ కంగారు పడింది.

'ఏయ్ ..... ఎందుకలా ఇక్కడికొచ్చి ఏడుస్తావ్..... వెళ్ళిపో...... ఇంకెప్పుడు ఆడపిల్లలతో అలా ప్రవర్తించకు.....'ది.

అతను తలమీద విగ్గు, రొయ్యమీసాలూ తీసేశాడు.

అతనెవరో కాదు.....

రాంబాబు!.....

రాంబాబుని చూడగానే సరోజ కంగారుపడింది.

'అయ్యో రాంబాబూ....సారీ రంబాబూ నువ్వా? నేనింకా ఎవరో జులాయ్‌వెధవని అనుకున్నాను.... అయినా ఈ వేషం ఏంటి?' అడిగింది సరోజ.

క్రితంరోజు తాము డిటెక్టివ్ సింహస్వప్న దగ్గరికి వెళ్లడం, పదివేల కోసం అతను ద్రోహం తలపెట్టడం, తాము తప్పించుకుని పారిపోవడం అంతా చెప్పాడు రాంబాబు.

'నా ఫోటో పేపర్లో పడింది ..... అందుకే అందరూ గుర్తుపడ్తారు. దానికితోడు నా తలమీద పదివేల రూపాయలు ప్రైజ్ పెట్టారు. కాబట్టి గుర్తుపట్టలేనివాళ్ళు కూడానన్ను కష్టపడి గుర్తుపట్టి పోలీసులకి పట్టించడానికి ప్రయత్నిస్తారు..... అందుకే ఇలా మారువేషాల్లో తిరగడం మంచిదనిపించింది......' అన్నాడు రాంబాబు.

'బాగా దెబ్బలు తగిలాయా రాంబాబూ?'

జాలిగా అడిగింది సరోజ.

'కనిపించడంలేదూ?..... అంతా నీవల్లే.....'

'అలా కన్నుకొట్టి ..... నా దగ్గరకొచ్చి చేతుల్తో గీరకపోతే నేను రాంబాబుని అని చెప్పకూడదూ?....'

'బస్సులో అంతమంది మధ్యలో ఎలా చెప్పేది?.... ఎవరైన వింటే పట్టుకుని పోలీసులకి అప్పజెప్పరూ?'

'పోనీ మీరు సరోజ చెవిలో చెప్పి ఉండాల్సిందండీ' అంది జయంతి.

'చెవిలో చెప్దామని ముందుకి వంగానని అనుకోం ..... అప్పుడు ముద్దుపెట్టుకోడానికి వంగుతున్నాననుకుని సరోజ ఇంకా గట్టిగా మూతిమీద గుద్ది ఉండేది. జనం మరీ ఇదిగా తన్ని ఉండేవారు....' అన్నాడు రాంబాబు మొహం ముడుచుకుంటూ.

'పాపం ..... చాలా దెబ్బలు తగిలినట్టున్నాయ్.....వేడివేడి కాఫీ ఇస్తానుండండి.....' అంటూ లోపలికి వెళ్ళింది జయంతి.

రాంబాబు వీపు, జబ్బలూ తడుముకోసాగాడు.

'సారీ రాంబాబూ...... ' మరోసారి చెప్పింది సరోజ రాంబాబు వంక జాలిగాచూస్తూ.

'పరవాలేదులే.....నీకు తెలీక చేశావ్ కదా?.....' అన్నాడు.

'అవునూ నీ ఫోటో పేపర్లో వేశారు కదా.....ఈ గొడవలన్నీ మీ అమ్మా నాన్నలకి తెలీవా?.....'

'బహుశా హైదరాబాద్ ఎడిషన్ న్యూస్‌పేపర్లల్నే వేసి ఉంటారు లేకపోతే ఈ పాటికి గుండెలు బాదుకుంటూ వచ్చేసి ఉండేవారుకదా?.....'

'ఈ విషయాన్ని మీ అమ్మా నాన్నలకు తెలియజెయ్యడం మంచిదేమో......'

'వద్దు.... అనవసరంగా వాళ్లని క్షోభపెట్టడం దేనికి?..... నేను ఈ ఊబిలోంచి

బయటపడితేసరి....లేదా పోలీసులు నన్ను పట్టుకుని జైల్లో వేస్తే అప్పుడెలాగూ వాళ్ళకి తెలుస్తుంది......'

జయంతి కాఫీ తీసుకొచ్చింది.

'మీ యింట్లో ఆస్ప్రినో, యనాసినో ఉందా..... ఒళ్ళంతా ఒకటే నొప్పిగా ఉంది.....' అన్నాడు రాంబాబు కాఫీ అందుకుంటూ.

జయంతి టాబ్లెట్ వేస్కున్నాడు రాంబాబు.

అప్పుడే శ్యామ్రావు వచ్చాడు.

'అరెరె.....ఏంటిది? యాక్సిడేంటేమైనా అయ్యిందా?......' రాంబాబుని చూస్తూనే అడిగాడు శ్యామ్రావు.

రాంబాబు జరిగిన విషయం అంతా చెప్పాడు. భవిష్యత్ కార్యక్రమం గురించి వాళ్ళు నలుగురూ చర్చించారు.

'నీలిమ డైమండ్ నెక్లెస్ వీరూ దగ్గర దొరికింది. కాబట్టి వీరూ అడ్రస్ కనుక్కుని వాడు ఇంట్లో లేనప్పుడు వాడి ఇల్లు సోదాచేస్తే ఏదైనా ఆధారం దొరకొచ్చు.....' అంది సరోజ.

సరోజ అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు.

### *అడ్రసు దొరికింది*

అది ఒక జువెల్రి షాప్.

'మిట్టమద్యాహ్నం కాబట్టి షాపులో ఒకరిద్దరు కష్టమర్లు తప్పఎవరూ లేరు.

అప్పుడే ఇద్దరు వ్యక్తులు ఆ షాపులో అడుగుపెట్టారు. ఆ షాపులోని ఎవరూ వాళ్ళని రిసీవ్ చేసుకోలేదు, కారణం వాళ్ళరూపమే.

మొదటివ్యక్తికి పాతికేళ్ళుంటాయ్. ఎత్తుఅయిదడుగుల ఆరంగుళాల పొడువు ఉంటాడు. పొట్టిగా కత్తిరించిన క్రాపు. గుండు చేయించుకున్న నెల రోజులకి పెరిగిన జుట్టులా చిన్న వెంట్రుకల్తో ఉంది ఆ క్రాపు. గళ్ళలుంగీమీద బిగుతుగా, పొట్టిగా ఉన్న ఎర్రని టీషర్టు వేస్కున్నాడు అతను. మెడలో తాయెత్తు ఉంది. గుబురు మీసాలు పైకి మెలేసి ఉన్నాయ్. గెడ్డం కాస్త మాసి ఉంది.

రెండోవాడికి దాదాపు పద్నాలుగు ఏళ్ళుంటాయి. వాడికి జులపాలజుట్టుంది. అడ్డచారల బనీను వేస్కున్నాడు.

వాళ్ళిదరూ ఎవరోకాదు.

మారువేషాల్లో ఉన్న రాంబాబు, కిష్టయ్యలు!!

'అర్రేయ్ కిషన్ ..... వాళ్ళు ఎందుకొచ్చిర్రో కనుక్కోరా......' అంటూ అరిచాడు సేఠ్ చమన్లాల్.